క్లుప్తంగా

మహిళలకు ఆత్మరక్షణ మెళకువలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్: మహిళలు ఆత్మరక్షణ మెళకువలు తెలుసుకోవాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు సూచించారు. సోమవారం డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు, శక్తి యాప్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. చదువుపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

- సీఐ సుబ్బారావు



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై అంకమరావు

మార్కాపురం: గ్రామీణ ప్రజలు సైబర్ మోసాలు, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్, మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బారావు సూచించారు. పల్లె నిద్రలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని వేములకోట గ్రామంలో రూరల్ ఎస్సై అంకమరావుతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే వెబ్ లింకులను ఓపెన్ చేయవద్దని, అపరిచితులకు ఓటీపీ చెప్పవద్దని స్పష్టం చేశారు. బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన నివాళి



ప్రసాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కార్యదర్శులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పాదిలి ప్రసాద్ గుండెపోటుతో మరణించగా ఆయన చిత్రపటానికి సహచర ఉద్యోగులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రసాద్ ఇటీవల కొంత పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రసాద్ గుండెపోటుతో అర్థంతరంగా మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

200 మంది పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ



పేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన రంజాన్ కిట్లు

కంభం: రంజాన్ పండగను పురస్కరించుకుని సోమవారం స్థానిక చిన్న మసీదులో 200 మంది పేద ముస్లింలకు రూ.2.50 లక్షల విలువైన 19 రకాల నిత్యావసర సరుకుల కిట్‌ను పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా చిన్న మసీదు కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో కిట్లు పంపిణీ చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు డిష్ మున్నా తెలిపారు. కార్యక్రమంలో హాఫీజ్ హంజా, ఆదిల్, జబ్బార్, మహబూబ్ బేగ్, అత్తార్ షేక్ హుస్సేన్(దాదా), ఖాసింపీరా, సయ్యద్ ఖాన్, సమీర్, షాకీర్, రిహాన్, సాహిల్, షా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి



కొమరోలులో మాట్లాడుతున్న ఏఓ రాజశ్రీ

కొమరోలు: భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. కొమరోలులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయం, వెలుగు సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగించడం వల్ల ఆహార ధాన్యాలు, కూరగాయలు, భూమి కలుషితమై మానవాళి ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ప్రతి రైతునూ ప్రకృతి వ్యవసాయం వైపు మరల్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పెట్టుబడి రూ.లక్షల్లో.. లాభం రూ.వేలల్లో..!

- మార్కెట్‌లో టన్ను అరటి ధర రూ.8 వేలకు లోపే..
- గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతుల ఆందోళన
- ఏడాదంతా శ్రమించినా నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యాన రైతుల వినతి



కొమరోలు : కోసిన పంటను సిద్ధం చేస్తున్న కూలీలు

కొమరోలు: సిరులు కురిపిస్తుందనుకున్న అరటి పంటకు మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు నష్టాలబాట పడుతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, వ్యాపారులు సిండికేట్ కావడంతో అరటి ధరలపై తీవ్రంగా ప్రభావం పడుతోంది. కొమరోలు మండలంలో బ్రాహ్మణపల్లె, రెడ్డిచర్ల, నల్లగుంట్ల, ముక్తాపురం గ్రామ పంచాయతీల్లో 120 ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టారు. ఇక్కడ పండించిన అరటిని హైదరాబాద్, కర్నూలు మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. దాదాపు 10 నుంచి 12 నెలలపాటు శ్రమించి పంట పండించిన అరటి రైతులను ఈ ఏడాది ధరలు నిండా ముంచాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా సరైన దిగుబడిరాకపోగా.. ధరలు సైతం అమాంతం పడిపోవడంతో రైతులు కుదేలయ్యారు. గత నెల వరకు టన్ను రూ.20 వేలు పలికిన అరటి.. నేడు పంట చేతికొచ్చే సరికి రూ.8 వేలకు పడిపోవడంతో రైతన్నలకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం కష్టం చేసినా ఫలితం లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అరటి ధర ఇలాగే కొనసాగితే కూలీలకు చెల్లించేందుకు కూడా సరిపోవని రైతులు పేర్కొంటున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచిన అరటిగెలలు

మార్కెట్‌లో అరటి టన్ను రూ.8 వేలు



ఒక ఎకరాలో అరటిపంటను సాగు చేశాను. ఎకరాకు 30 టన్నుల వరకు పంట దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 15 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. గత నెల వరకు టన్ను 20వేల రూపాయలు బహిరంగ మార్కెట్‌లో ఉండగా ప్రస్తుతం 8వేల రూపాయలు మాత్రమే పలుకుతున్నది. ఎకరాకు 1.50లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టగా లాభం 50వేలు కూడా రావడం లేదు. తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– పుల్లారెడ్డి, రైతు, పామూరుపల్లె గ్రామం

ఆదాయం తక్కువ



అరటి పంట సాగు చేయడం కష్టంగా మారింది. పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో కూలీల రేట్లు కూడా గిట్టుబాటు కావడం లేదు. ఒక్కో అరటి మొక్క 15 రూపాయలు పెట్టి కొనగా వాటి పోషణ భారం 100 రూపాయలకు చేరుతోంది. కానీ బహిరంగ మార్కెట్‌లో డజన్ అరటి పండ్లు 60 రూపాయలు ఉండగా మా వద్ద 15 రూపాయలకు కూడా కొనుగోలు చేయడం లేదు.

– గోపు రమణరెడ్డి, రైతు, పామూరుపల్లె గ్రామం

ఉద్యాన పంటలకు సబ్సిడీ ఇవ్వాలి



నేను 2 ఎకరాల్లో అరటి పంట సాగు చేశా. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగా లేదు. మార్కెట్‌లో ధరలు కూడా సగానికి సగం తగ్గుముఖం పట్టాయి. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడి కల్పిస్తే పంటలను పండించగలం. టన్ను 8 వేల రూపాయల చొప్పున మార్కెట్‌లో అమ్మితే గిట్టుబాటు కాదు.

– దద్దాన రంగారెడ్డి, రైతు, పామూరుపల్లె గ్రామం

క్షయపై అవగాహన అవసరం



బేస్తవారిపేటలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని బేస్తవారిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి పి.పృథ్వీరాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, కఫంలో రక్తం పడటం, ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గు, తుమ్ములతో ఒకరినుంచి మరోకరికి వ్యాధి సోకుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాహుల్, జవహర్, కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: క్షయవ్యాధిని నిర్మూలించేందుకు కలిసికట్టుగా ప్రయత్నిద్దామని నంద్యాల రోడ్డులోని యూపీహెచ్‌సీ వైద్యాధికారి జుబేదా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధికి వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుధారాణి, రవీంద్రారెడ్డి, ప్రసాద్, రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రెడ్ల సత్రం గౌరవ సలహాదారుగా 'కాసు'



కాసును సన్మానిస్తున్న సత్రం కమిటీ సభ్యులు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని యోగి వేమన రెడ్ల అన్నదాన సత్రం గౌరవ సలహాదారునిగా కాసు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్రంలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సత్రంలో తీసుకోవాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ.. సత్రం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కాసు ట్రస్ట్ తరఫున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను సత్రం కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో యోగి వేమన రెడ్ల సత్రం గౌరవాధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, అధ్యక్షుడు తాతిరెడ్డి పెదవెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎక్కంటి సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి ఆర్‌వీ సుబ్బారెడ్డి, కార్యదర్శి సానికొమ్ము రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చప్టా నిర్మించాలని మహిళల వినతి



సమస్యపై ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

బేస్తవారిపేట: స్థానిక నెహ్రూ వీధి చివరన చప్టా నిర్మాణం కోసం తీసిన గుంతలో వృద్ధులు, చిన్న పిల్లలు పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బేస్తవారిపేట పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న మహిళలు కార్యదర్శితోపాటు సర్పంచ్ తండ్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. 25 రోజుల క్రితం జేసీబీతో లోతైన గుంత తీసి వదిలేయడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారిందన్నారు. రెండు రోజుల్లో పనులు మొదలు పెట్టిస్తామని కార్యదర్శి హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

కందుల ధరపై రైతులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏఓ జైనులాబ్దిన్

పొదిలి: రైతులు పండించిన కందులకు ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరపై అవగాహన కల్పించాలని ఏఓ షేక్.జైనులాబ్దిన్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం గ్రామాల్లోని అగ్రనైజర్లు, వ్యవసాయ సహాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. మాదాలవారిపాలెం సొసైటీ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. రైతులు దళారుల మాటలు నమ్మకుండా కేంద్రాల్లోనే కందులు అమ్ముకునేలా అవగాహన కల్పించాలన్నారు. మద్దతు ధర రూ.7,550గా నిర్ణయించినట్లు చెప్పారు. జీరో బేస్‌డ్ నేచురల్ ఫార్మింగ్ అధికారులు మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వినియోగించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపడం వల్ల నాణ్యమైన పంటలు పండించవచ్చన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష 13కు వాయిదా

కంభం: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షను ప్రభుత్వం ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా వేసినట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా ఏప్రిల్ 6వ తేదీన పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా అనివార్య కారణాలతో వాయిదా వేశారని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న 5వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు గమనించి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరవుతున్నారని, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించాలి



తర్లుపాడు : మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి



మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

గిద్దలూరు రూరల్: పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి, సృజనాత్మకతను పెంపొందించే దిశగా కృషి చేయాలని సీడీపీఓ జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద కాలనీలోని సీసీ స్కూల్ ఆవరణలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పిల్లల పెంపకంలో తల్లిపాత్ర ఎంతో కీలకమైందన్నారు. పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.వసంత కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక ఒంగోలు రోడ్డులోని సర్ సీవీ రామన్ కళాశాలలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. సీడీపీఓ సుధమారుతి మాట్లాడుతూ.. మూడు అంశాలపై ప్రధానంగా ఇస్తున్న శిక్షణను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యకర్తలకు జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభాషిణి, ప్రసన్న, సావిత్రి, సరిత, ఝాన్సీరాణి పాల్గొని శిక్షణ ఇచ్చారు.



పొదిలిలో మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి

పౌష్టికాహార లోపాన్ని నివారించండి

తర్లుపాడు: పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలని మార్కాపురం ఐసీడీఎస్ సీడీపీఓ బి. సుశీలాదేవీ పేర్కొన్నారు. మార్కాపురం ప్రాజెక్టు పరిధిలోని ఐసీడీఎస్ కార్యకర్తలు, ఆయాలకు కలుజువ్వలపాడు జెడ్పీ హైస్కూల్లో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలను గమనిస్తూ, తల్లీపిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువత

మార్కాపురం: దేశం కోసం ప్రాణాలొడ్డిన మహనీయుడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని సీపీఎం నాయకుడు డీకేఎం రఫీ పేర్కొన్నారు. వారి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు త్యజించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను ప్రభుత్వాలు కొనసాగించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, విద్య వైద్యాన్ని ప్రైవేటీకరణ చేయవద్దని కోరారు. కార్యక్రమంలో దేవదాసు, చిన్నీ, అభిషేక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

కంభం: ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక ఆర్టీసీ బస్టాండులో కూలింగ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. మైజీవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షేక్ బాజిద్ బాష , డాక్టర్ లతీఫ్ సాహెబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, డాక్టర్ మహబూబ్ బాషా, ఎంపీటీసీ రఫీ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, డిష్ మున్నా, నంబర్ వన్ బాష, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెడ్ల సంక్షేమ సంఘ నాయకులు

కంభం: నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలోని చేగిరెడ్డి లింగారెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం యోగి వేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు జొన్నకూటి వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆంజనేయరెడ్డి, పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, పిచ్చిరెడ్డి, సంఘ సభ్యులు గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో పారిశుధ్య పనులు



శుభ్రం చేస్తున్న కార్మికులు

పొదిలి: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక బుగ్గచలం ట్యాంకు వద్ద ఉన్న ఈద్గాను శుభ్రం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలుత మైదానంలో ఉన్న చెత్త, పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించే పనులను నగర పంచాయతీ కార్మికులు చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈద్గాను ముస్తాబు చేస్తామని మైనారిటీ సెల్ నాయకుడు రసూల్, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీ తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల, బేస్తవారిపేట జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో టెన్త్ పరీక్షలను తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి తనిఖీ చేశారు. సోమవారం నిర్వహించిన గణితం పరీక్షకు బేస్తవారిపేట బాలుర హైస్కూల్లో 142 మందికిగాను 141, బాలికల హైస్కూల్లో 190కి 190, పిటికాయగుళ్ల హైస్కూల్లో 139 మందికిగాను 138 మంది హాజరైనట్లు ఎంఈఓ వివరించారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలో సెయింట్‌పాల్స్ ఎ, బి–సెంటర్లలో పదో తరగతి పరీక్షలను స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సోమవారం పర్యవేక్షించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, నరవ రోడ్డులోని నారాయణ స్కూల్ సెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్, జరుగుమల్లి ఎంఈఓ నాగేంద్రవదన్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను స్థానిక సీఐ కె.సురేష్ పరిశీలించారు.

రాచర్ల: మండలంలోని ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రాఘవ, ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చీఫ్‌గా ఈ.వెంకటేశ్వర్లు, డీవోగా జి.విజయరాజు ఉన్నారు.

కంభం: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం తహసీల్దార్ వి.కిరణ్ తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, ఇతర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచించారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద కంభం ఎస్సై నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

టెన్త్ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని 3 కేంద్రాల్లో సోమవారం గణితం పరీక్ష నిర్వహించగా 448 మందికిగాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ బొర్రా వెంకటరత్నం తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంఈఓ నాగేంద్రవదన్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, ఎస్సై నాగరాజు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎం హెచ్‌ఓ పద్మావతి



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

మార్కాపురం: టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి అన్నారు. టీబీ డే సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో కలిసి టీబీ వ్యాధిపై ర్యాలీని సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తగ్గకపోవడం, బరువు తగ్గిపోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీకి మంచి మందులు ఉన్నాయని, ఉచితంగా ప్రభుత్వ వైద్యశాలలో తీసుకోవచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రవణ్, శివారెడ్డి, ఎస్‌టీఎస్ గోవిందరాజులు, టీబీహెచ్‌వీ లక్ష్మీరెడ్డి, ఎన్ ఆవులయ్య, నాగేంద్రరెడ్డి, ప్రత్యూష, ఏఎన్‌ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.